సాక్షి
మెదక్
సోమవారం । 22 । జనవరి । 2024

న్యూస్‌రీల్

నేడు ఓటరు నమోదుకు చివరి చాన్స్



ఓటరు నమోదు కేంద్రంలో అంబాదాస్ రాజేశ్వర్

చిన్నశంకరంపేట(మెదక్): ఓటరు నమోదుకు సోమవారం తుదిగడువని ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్ తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఓటరు నమోదుపై ఆరా తీశారు. బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు రెండు రోజులపాటు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒకవేళ నమోదు చేసుకోకుంటే తుదిగడువురోజు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఈఓ సంతోష్, బీఎల్‌ఓలు మాలతీ, జ్యోతి, రాణి ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మల్లేశ్(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చండీ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాదాసు మల్లేశ్ (50) గ్రామ శివారులోని ఫ్రాఫాం సీడ్ కంపెనీలో కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం కంపెనీలో బోరు మోటారు పని చేయడం లేదని సూపర్‌వైజర్ అతనికి చెప్పాడు. తాను ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి కింద పడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మల్లేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.

సీఎస్‌ఐలో ప్రత్యేక ప్రార్థనలు



హాజరైన భక్తులు

మెదక్: జిల్లా కేంద్రంలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి భక్తులు ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి ప్రెసిబిటరీ ఇన్‌చార్జి శాంతయ్య ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులను ఆశీర్వదించారు. అనంతరం వారు మొక్కులు తీర్చారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

థర్మకోల్ రామ మందిరం



రామమందిరంతో విద్యార్థిని లాస్యప్రియ

కౌడిపల్లి(నర్సాపూర్): శ్రీరాముడిపై ఉన్న భక్తిభావాన్ని చూపించింది. అట్టముక్కలు, థర్మకోల్‌తో అయోధ్య రాముడి మందిరాన్ని తయారు చేసింది. మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామానికి చెందిన లాస్యప్రియ. ప్రైవేటు పాఠశాలలో ఆమె ఏడో తరగతి చదువుతుంది.

జనసంద్రం.. వన క్షేత్రం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వన క్షేత్రం ఆదివారం జనసంద్రంగా మారింది. పూజారులు పార్థివ శర్మ, శంకరశర్మ తెల్లవారుజామునే దుర్గమ్మను పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉదయం నుంచే తరలివచ్చి అమ్మను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చారు. భక్తులకు ఎలాంటి సౌకర్యం కలుగకుండా పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి ఏర్పాట్లు గావించారు.

కోరమీసాల స్వామి.. కోటి దండాలు

- కొమురవెల్లి మల్లన్న క్షేత్రం భక్తజన సంద్రం
- వైభవంగా బ్రహ్మోత్సవాలు షురూ
- పట్నం వారానికి పోటెత్తిన భాగ్యనగర వాసులు
- మల్లన్న నామంతో పులకరించిన శైవక్షేత్రం



స్వామి వారి రాజగోపురం భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న స్వామి మమ్మేలు.. కోరమీసాల స్వామి దీవించు.. అంటూ భక్త జనం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. కొమురవెల్లి మల్లన్న క్షేత్రం భక్తజనసంద్రమైంది. ఆదివారం స్వామివారి జాతర బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మల్లన్న నామస్మరణతో ఆలయ పరిసరాలన్నీ మారుమోగాయి. శివసత్తుల శిగాలు.. పోతరాజుల విన్యాసాలతో ఆలయ ప్రాంగణమంతా సందడి నెలకొంది. ఉదయం నుంచే స్వామి దర్శనానికి బారులుతీరారు. స్వామి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పట్టింది. అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి ఆదివారాన్ని పట్నం వారంగా పిలవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నగరానికి చెందిన వేలాది మంది భక్తులు మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

బోనాలతో బారులు..

అందంగా అలంకరించిన బోనాలతో మహిళలు, యువతులు తరలివచ్చారు. ఆలయ వీధులన్నీ బోనాలతో నిండిపోయాయి. స్వామికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

దారులన్నీ కొమురవెల్లికే ...

ఎటుచూసినా భక్తజనమే కనిపించింది. దారులన్నీ కొరుమవెల్లికే దారితీశాయి. రాష్ట్రంలోని పలు జిల్లానుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయానికి చేరుకునే రహదారుల్లో 2 కిలోమీటర్ల మేర భక్తులు నిండిపోయారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ కమిషనర్ అనురాధ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఏసీపీ సతీష్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు భక్తుల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకున్నారు.



స్వామి వారికి బోనం సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

నిరుపయోగం

యోగా కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. జిల్లాలో పలుచోట్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నా గానీ శిక్షకులను నియమించ లేదు. దీంతో లక్షలు పోసి చేపట్టిన కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. యోగాను ప్రజలకు చేరువ చేయాలనే ఆయుష్ మిషన్ లక్ష్యం నీరుగారిపోతోంది.

అలంకారప్రాయంగా యోగా కేంద్రాలు

- జిల్లాలో తొమ్మిది నిర్మాణాలు పూర్తయి రెండేళ్లు
- ఒక్కో కేంద్రానికి రూ. 6 లక్షలు
- శిక్షకుల నియామకాలెప్పుడో?



మెదక్‌లో నిర్మించిన యోగా సెంటర్

మెదక్: నేటి సగటు మనిషి ఉరుకుల పరుగుల జీవితం గడుపుతున్నాడు. సమయ పాలన లేకుండా విధులు నిర్వహిస్తున్నాడు. పనిఒత్తిళ్లు, మారుతున్న ఆహార అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం ఇవన్నీ కూడా అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నది. ప్రశాంతత లేకపోగా మూడు పదుల వయసులోనే దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్నాడు. కరోనా అనంతరం పలువురిని అధికంగా ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. వాటి నుంచి ఉపశమనం కల్పించేందుకు యోగా ఉత్తమమని కేంద్రం ప్రభుత్వం భావించింది. జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా ఆరోగ్య స్వస్థత కేంద్రాలు (యోగా కేంద్రాలు) మంజూరు చేసింది. నిర్మాణాలు సైతం పూర్తయి ఏళ్లు గడుస్తున్నాయి. ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు.

మెదక్ జిల్లాలో 14 ఆయుర్వేదిక్ (ఆయుష్) ఆస్పత్రులున్నాయి. సెంటర్‌కు ఒక్కటి చొప్పున 14 యోగా కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం 2021లో మంజూరు చేసింది. కేంద్రానికి రూ.6 లక్షలను విడుదల చేసింది. జిల్లాలో 9 సెంటర్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మెదక్, సర్దన, టొంతి, చీకోడు, పెద్దశంకరంపేట, హెల్ఫ్‌గొండ, రంగంపేట ముప్పారం, ఖాగజ్‌మగ్దూర్ మండలాల్లో ఈ నిర్మాణాలు పూర్తయి రెండు సంవత్సరాలు గడుస్తున్నాయి. నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ఆయుష్ విభాగ పర్యవేక్షణలో యోగా శిక్షకులను నియమించి రోజూ ఈ సెంటర్లలో ఉదయం, సాయంత్రం ప్రజలకు ఆసనాలు వేయించాలన్నది ఉద్దేశం. దీంతో దీర్ఘకాలిక వ్యాధులతోపాటు, మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఆసనాలు వేస్తూ మంచి ఆహార అలవాట్లు కలిగి ఉంటే అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చు. గర్భిణులకు కూడా ఆసనాలు నేర్పించాల్సి ఉంటుంది. మంచి ఆలోచనతో ఏర్పాటు చేసిన కేంద్రాలు యోగా శిక్షకులు లేక నిరుపయోగంగా మారాయి. ఆశా కార్యకర్తలను ఆ పోస్టులో నియమించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆసక్తి, చురుకుగా ఉన్న వారి పేర్లను పంపించాలని సూచించింది. శిక్షణిచ్చి నియమించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

లాభాలు..

యోగా ద్వారా అనేక లాభాలు ఉన్నాయి. నిత్యం ఆసనాలు వేస్తే ప్రాణవాయువు సక్రమంగా అందుతుంది. షుగర్, బీపీ అదుపులో ఉంటాయి. జీర్ణ వ్యవస్థ మెరుగు పడుతుంది. రోజుకు గంట సమయం కేటాయించినా రోజంతా చురుగ్గా ఉంటుంది. శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుంది. వ్యాధులు దరి చేరవు. ముఖ్యంగా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి నియంత్రణలో ఉంటాయి.

పకడ్బందీగా ఓటరు జాబితా



మక్తభూపతిపూర్ పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓతో మాట్లాడుతున్న రాజర్షిషా

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పుల విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఆదివారం మెదక్ మండలం మక్తభూపతిపూర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఓటరు జాబితాను జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా రూపొందించాలన్నారు. మరణించిన, 100 ఏళ్లకు పైబడిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, చిరునామా మారిన ఓటర్లపై దృష్టి పెట్టాలన్నారు. వీటితోపాటు అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారని బీఎల్‌ఓలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, బీఎల్‌ఓ, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1980 దరఖాస్తులు

జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించిన నూతన ఓటరు నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు కలెక్టర్ రాజర్షిషా ఆదివారం తెలిపారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని 579 పోలింగ్ కేంద్రాల వద్ద నూతన ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించగా మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు కోసం మొత్తం 1980 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. విధుల్లో 579 మంది బీఎల్‌ఓలు, 25 మంది బీఎల్‌ఏలు, 264 మంది ఏఈఆర్‌ఓలు, 51మంది ఈఆర్‌ఓలు, ఏడుగురు డీఈఓలు పాల్గొన్నారని తెలిపారు

ప్రజల్లో భక్తిభావం పెరగాలి

- ఎమ్మెల్యే సునీతారెడ్డి
- లక్ష్మీనర్సింహస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజలందరూ భక్తి భావాలతో ఉండాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర మహోత్సవాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. పూర్ణకుంభంతో ఆలయ సిబ్బంది స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మీనర్సింహస్వామిని కొలిస్తే అనుకున్న కార్యం తప్పకుండా నెరవేరుతుందన్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని స్వామిని వేడుకున్నట్లు చెప్పారు. భక్తుల తాగు నీటి సౌకర్యార్థం తన సొంత నిధులతో జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా బోరు మోటారు ఏర్పాటు చేస్తే ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్యమాధవరెడ్డి, సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ నర్సింహరెడ్డి, నాయకులు హన్మంత్‌రెడ్డి, పిట్ల సత్యనారాయణ, యాదగౌడ్, మహేందర్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, కుంట లక్ష్మణ్, శ్రీశైలంయాదవ్, నర్సింగ్, నర్సింహులు ఉన్నారు.



లక్ష్మీనర్సింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

భక్తుల పూజలు

జాతర మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ పూజారులు స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కోనేరు పక్కనున్న ఆలయంతోపాటు గుట్టపై స్వయంభూగా వెలిసిన లక్ష్మీనర్సింహస్వామికి అర్చకులు పూజలు నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ నర్సింహారెడ్డి తదితరులున్నారు.

ప్రాణప్రతిష్ఠ సంబురం

విద్యుత్ దీపాలతో రామాలయాలు ముస్తాబు

మెదక్ మున్సిపాలిటీ: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఊరూవాడా శ్రీరామ నామం జపిస్తోంది. భక్తులు తమ ఇళ్లపై ఆంజనేయ స్వామి, సీతారామచంద్ర స్వామి ఉన్న జెండాలను ఎగురవేశారు. మరికొందరు వాహనాలకు సైతం జెండాలు అమర్చారు. ఇళ్లు, వ్యాపారసంస్థల ప్రధాన ద్వారాలకు రాముడి స్టిక్కర్లు అంటించి భక్తిని చాటారు. అలాగే మెదక్‌లోని కోదండ రామాలయాన్ని రంగురంగుల దీపాలతో ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం మాధవానంద సరస్వతీ స్వామి ప్రత్యేక పూజలు చేయనున్నారని ఆలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్ తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, పుష్పార్చన, హనుమాన్ చాలీసా పారాయణ జరగనుంది. సాయంత్రం భజనలు, కోలాటాలు, సహస్ర రామ జ్యోతుల దీపారాధన, భరతనాట్యం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజంతా నిరంతరాయంగా రామనామ సంకీర్తనలు ఆలపించనున్నాయి.

శోభాయాత్రలు, ర్యాలీలు

సోమవారం భక్తులు ప్రాణప్రతిష్ఠ ముహూర్తంలోనే శోభాయాత్రలు, భజనలతో ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఆలయాలు, ప్రధాన కూడళ్లలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీన్లు సిద్ధం చేస్తున్నారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. అయోధ్యలో జరిగే కార్యక్రమాల వివరాలు, ప్రత్యేకతలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



విద్యుత్ కాంతుల్లో మెదక్ కోదండ రామాలయం



‘గ్యాస్’ తిప్పలు

- బుక్ చేసుకున్నా ఇంటికి చేరని సిలిండర్
- ఏజెన్సీ కార్యాలయం వద్ద బారులు
- ఎక్కువ ధర వసూలు చేస్తున్న నిర్వాహకులు

జిన్నారం(పటాన్‌చెరు): గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు తిప్పలు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసినా ఇంటికి సిలిండర్ రావడం లేదు. ఏజెన్సీ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసినా నిరాశే ఎదురవుతోంది. అసలు ధరకన్నా ఎక్కువగా డబ్బులు చెల్లిస్తేనే సిలిండర్లు ఇస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఓ గ్యాస్ ఏజెన్సీ వినియోగదారులు సిలిండర్ కోసం అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ పరిధిలో ఆ ఏజెన్సీకి సంబంధించి సుమారు 25వేల కనెక్షన్లు ఉన్నాయి. వీరికి సకాలంలో సిలిండర్లను అందించటంలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని అధిక ధరకు సిలిండర్లను అమ్ముకుంటున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా వినియోగదారులకు మాత్రం సిలిండర్ ఇంటికి పంపించడం లేదు. విధిలేక ఏజెన్సీ కార్యాయలం వద్ద బారులు దీరుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్‌లో నిలబడినా గ్యాస్ లభిస్తుందన్న గ్యారెంటీ లేదు. అసలు ధర కంటే అదనంగా రూ.100 చెల్లిస్తేనే ఇస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సిలిండర్లను విక్రయిస్తున్నారని ఏజెన్సీ కార్యాలయం ఎదుట స్థానిక నాయకుల ఆధ్వర్యంలో వినియోగదారులు ఆందోళనలు చేసినా ఎలాంటి స్పందనా ఉండటం లేదు. ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.



ఏజెన్సీ ఎదుట నిరసన తెలుపుతున్న వినియోగదారులు, నాయకులు (ఫైల్)

కొరత వల్లే సమస్య

ప్రస్తుతం సిలిండర్ల కొరత ఉంది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి మూడు రోజుల్లో డెలివరీ చేస్తున్నాం. ఎక్కువ డబ్బు వసూలు చేస్తున్నారనడం అవాస్తవం. సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– భారతి, ఏజెన్సీ నిర్వాహకురాలు

లెనిన్‌కు ఘననివాళి

- ఆయన స్ఫూర్తితోనే సమస్యలపై పోరాడుతున్నాం
- ఫిబ్రవరి16న దేశవ్యాప్త సమ్మెకు తరలిరండి : మల్లేశం పిలుపు

మెదక్ కలెక్టరేట్: రష్యన్ విప్లవం తీసుకు రావడంలో లెనిన్‌ది చాలా కీలకపాత్రని సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు రష్యాలో జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. అలాగే అనేక దేశాలకు ఇది మార్గదర్శకంగా నిలిచిందన్నారు. బలమైన కమ్యూనిస్టు పార్టీలను నిర్మించుకోవాలి అని నాడే ఆయన చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మిక, కర్షక మైత్రి కోసం దేశంలో సంయుక్త కిసాన్ మోర్చా ద్వారా కార్మిక సంఘాలన్నీ కలుపుకొని సమస్యలపై పోరాడుతున్నామన్నారు. దానికి అనుగుణంగానే వచ్చేనెల ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మె- గ్రామీణ బంద్‌ను చేపడుతున్నామన్నారు. పారిశ్రామిక, ఉద్యోగులు కూడా ఒక రోజు సమ్మె చేపట్టనున్నట్లు చెప్పారు. ఆయన ఆశయాలకనుగుణంగానే సీపీఎం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కే మల్లేశం, బీ బసవరాజు, జిల్లా కమిటీ సభ్యులు కే నర్సమ్మ, జే సంతోష్, నాయకులు సత్యం, జగన్, అజయ్, దుర్గా, తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



ట్రోఫీతో బొర్రగూడెం విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): నేషనల్ లెవెల్ కరాటే టోర్నమెంట్‌లో వర్గల్ మండలం బొర్రగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మెరిశారు. ఆదివారం హైదరాబాద్ యూసుఫ్‌గూడ వేదికగా నిర్వహించిన కరాటే టోర్నీలో పాఠశాల నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సింగిల్ కటా, గ్రూప్ కటాలో సత్తా చాటారు. గ్రూప్ కటా విభాగంలో అత్యుత్తమ ప్రతిభతో ట్రోఫీని సొంతం చేసుకున్నారు. వ్యక్తిగత కటా విభాగంలో రచన, చందన, రక్షిత, సౌమ్యశ్రీ, వైష్ణవి, సాయిశృతి, లోకేశ్వరీ, మాళవిక, కావ్య, లక్ష్మీ ప్రసాద్, అనిరుధ్ చక్కని ప్రతిభ కనబర్చి మెడల్స్, సర్టిఫికెట్లు పొందారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ నరేశ్‌ను ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

పాత కక్షలతో యువకుడి హత్య

రాయికోడ్(అందోల్): పాత కక్షలతో యువకుడిని హత్య చేసిన ఘటన మండల పరిధిలోని సింగితం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు.. సింగితం గ్రామానికి చెందిన రాజు తన కూతురి వివాహబంధం పాడవడానికి గ్రామానికి చెందిన రవి(25) కారణమని భావించాడు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా రాజు రవిపై కక్ష పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఆటోలో కూర్చున్న రవిపై రాజు కమ్మకత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రవిని జహీరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పీడీఎఫ్ బియ్యం పట్టివేత



మిరుదొడ్డి(దుబ్బాక): అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఓ ఆటోలో 8 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తిని, ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికకు మాయమాటలు చెప్పి..

పెళ్లి చేసుకున్న నిందితుడి అరెస్ట్

పటాన్‌చెరు టౌన్: బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్న ఘటనలో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్ర లాతూర్ జిల్లా ఉద్గార్‌కు చెందిన షేక్ సోయబ్ కుత్బుద్దీన్ అనే వ్యక్తి పటాన్‌చెరులో ఉంటున్న ఓ బాలిక(16)ను ఈనెల 12వ తేదీన కారులో ఎక్కించుకొని తీసుకెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన సోదరి వెంటనే తల్లికి చెప్పింది. ఆమె పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అపహరణ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పటాన్‌చెరు పోలీసులు సీడీఆర్ ఆధారంగా లాతూర్‌లో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నందుకు అతడిపై పోక్సో కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పట్నం వారం.. జనసంద్రం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న క్షేత్రం భక్తులతో కిక్కిరిసి పోయింది. మల్లన్న నామస్మరణతో ఆలయ పరిసరాలన్నీ మార్మోగాయి. వేలాది మంది భక్తులు మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అక్కడే బోనాలు తయారు చేసి స్వామివారికి సమర్పించారు. గంగిరేణి చెట్టు వద్ద పట్నాలు వేశారు. ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



మల్లన్న స్వామి ఆలయంలో పట్నం వేస్తున్న భక్తులు



ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం




బోనం సిద్ధం చేస్తున్న భక్తులు



స్వామి వారికి వస్త్రాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ



పార్కింగ్ స్థలంలో వాహనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు



నృతం చేస్తున్న భక్తురాలు

మల్లన్న భక్తులకు ఇక్కట్లు



తోట బావి ప్రాంగణంలో పని చేయని షవర్స్

తాగునీరు, పారిశుద్ధ్య లోపంతో ఇబ్బందులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో మొదటి వారం(పట్నంవారం)కు తరలివచ్చిన భక్తులకు ఇక్కట్లు తప్పలేదు. సుమారు లక్ష వరకు భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. జాతరకు ముందు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు సమావేశమై జాతరకు లక్షకు పైగా భక్తులు వస్తారని వారికి వసతులు తాగునీరు, పార్కింగ్, స్నానాలకు మొదలైన వసతులు కల్పిస్తామని చెప్పినా ఆశించ మేరకు కనిపించలేదు. తాగడానికి నీళ్ల లేక దుకాణాల్లో బాటిళ్ల కొనుక్కున్నారు. ఉదయం నుంచి ఆలయ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆలయం వెనుక మెట్ల ప్రాంతంలో పలు చోట్ల చెత్తాచెదారం పేరుకుపోయి కనిపించింది.

ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పాఠశాల స్థాయిలో విద్యార్థుల సమగ్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని మంత్రి నివాసంలో ఆదివారం తెలంగాణ స్టేట్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల వార్షిక క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు, మిగితా ఉపాధ్యాయులు, గ్రామస్తులు సమన్వయంతో పని చేసి ఫలితాల సాధనలో ముందంజలో ఉంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రంగా, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు సింగసారం వెంకటయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి మనీల, నాయకులు చంద్రశేఖర్, చీకోటి మహేశ్వర్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు

ఐఓసీ.. సౌకర్యాలు వదిలేసి

- అసౌకర్యాల నడుమ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ భవనం
- రూ.21 కోట్లతో మూడంతస్తుల నిర్మాణం
- ఏర్పాటు కాని ప్రభుత్వ కార్యాలయాలు
- సీసీరోడ్డు నిర్మాణం అంతంతే
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తేవడానికి గత ప్రభుత్వం ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) భవనాలను నిర్మించింది. రూ.కోట్ల వ్యయంతో భవనాలను నిర్మించినా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. అసౌకర్యాల మధ్య విధులు నిర్వహించలేక అధికారులు నామమాత్రంగానే పనులకు హాజరవుతున్నారు. దీంతో ప్రజలు ప్రభుత్వ సేవలకు దూరం అవుతున్నారు.

– హుస్నాబాద్‌రూరల్



ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ భవనం

హుస్నాబాద్ మండలం కిషన్‌నగర్ వద్ద నిర్మించిన ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) భవనాన్ని అరకొర వసతులతో గత ప్రభుత్వం నిర్మించి సెప్టెంబర్ నెలలో ప్రారంభించింది. అప్పుడే పాలిటెక్నిక్ రోడ్డు నుంచి ఐఓసీ భవనం వరకు 150 మీటర్ల సీసీ రోడ్డు నిర్మించి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అలాగే, హుస్నాబాద్, అక్కన్నపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎస్డీఎఫ్ (ప్రత్యేక అభివృద్ధి నిధి) నిధుల నుంచి రూ.90 లక్షలను మంజూరు చేసింది. రోడ్డు పనుల ప్రారంభానికి టెండర్ పిలిచే క్రమంలో ఎలక్షన్ కోడ్ వచ్చింది. దీంతో సీసీ రోడ్డు పనులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలో మొదలుకాని పనులను ప్రారంభించొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పనులు చేయడానికి అధికారులు ముందుకు రావడం లేదు.

రూ.21 కోట్లతో మూడు అంతస్తులు..

హుస్నాబాద్ ఐఓసీ భవనాన్ని దాదాపు రూ. 21 కోట్ల వ్యయంతో మూడు అంతస్తులు నిర్మించారు. మొదటి అంతస్తులో 11 ప్రభుత్వ శాఖలకు గదులను కేటాయించినా ఎస్టీఓ కార్యాలయం ఇప్పటికీ ఐఓసీ భవనంలోకి వెళ్లలేదు. రెండవ అంతస్తులోని గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో వీటిని పూర్తి చేయడానికి, భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టడానికి మరో రూ.4 కోట్ల నిధులు అవసరం ఉంటాయని ఇంజనీరింగ్ అధికారులు మూడు నెలల కిందటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇంకా నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అసంపూర్తి పనులను పూర్తి చేయిస్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు అద్దె భవనాల్లో ఉండే ప్రభుత్వ కార్యాలయాలు ఐఓసీ భవనంలోకి వెళ్తాయి. దీంతో ప్రభుత్వ పాలన ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. అలాగే సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. భవనంలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికార వర్గాలు కోరుతున్నాయి.



సీసీ రోడ్డు నిలిచిపోయిన పాలిటెక్నిక్ దారి

కొత్త ప్రభుత్వం నిర్ణయంతోనే..

అసంపూర్తి పనులను చేయడానికి కావాల్సిన నిధుల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాం. ఎస్డీఎఫ్ నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు చేసినా టెండర్‌కు పిలిచే క్రమంలో ఎలక్షన్ కోడ్ వచ్చింది. దీంతో పనులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే సీసీ రోడ్డు పనులు ప్రారంభమవుతాయి.

– మజీద్, ఏఈ, పీఆర్

బాల్ బ్యాడ్మింటన్‌లో కుర్రాడి సత్తా

- రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న 9వ తరగతి విద్యార్థి సిద్ధార్థ
- చిన్నప్పటి నుంచే క్రీడపై ఆసక్తి
- ఉమ్మడి జిల్లా జట్టుకు సారథ్యం వహిస్తూ అందరికీ ఆదర్శం



నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఆడుతున్న సిద్ధార్థ (ఎడమ నుంచి బ్యాక్ ప్లేయర్)

మిరుదొడ్డి(దుబ్బాక): బ్యాటు పట్టి గ్రౌండ్‌లోకి దిగాడంటే ప్రత్యర్థి క్రీడాకారుల వెన్నులో చలిపుట్టిస్తాడు.. బ్యాటు ఎత్తి ఝుళిపించాడంటే షాట్‌ల పర్వం కురిపిస్తాడు.. బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో రాణిస్తూ జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించాడు విద్యార్థి సిద్ధార్థ. మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని సరోజన బాలరాజు దంపతుల కుమారుడు సిద్ధార్థ మిరుదొడ్డి తెలంగాణ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. 4వ తరగతి నుంచే బాల్ బ్యాడ్మింటన్ క్రీడపై ఆసక్తి పెంచుకొని మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని సత్తా చాటుతున్నాడు.

జాతీయ స్థాయిలో..

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నమెంట్ 2023లో ప్రతిభను చాటి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. అదే ఏడాది ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు మంచిర్యాల జిల్లా రాంపూర్‌లో జరిగిన 41వ జాతీయ సబ్ జూనియర్-15 బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో రాష్ట్రానికి సారథ్యం వహించాడు. ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నాడు.

రాష్ట్ర స్థాయిలో..

ఉమ్మడి జిల్లా జట్టుకు సారథ్యం వహిస్తూ రాష్ట్రస్థాయికి సిద్ధార్థ ఎంపికయ్యాడు. సబ్ జూనియర్ అండర్-14 బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో భాగంగా పలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 2018లో బీహెచ్ఈఎల్ , 2019లో వరంగల్ జిల్లా కల్లూరు, 2020లో ఖమ్మం జిల్లా ఉప్పుగల్, 2021లో ఖమ్మం జిల్లా భువనగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడాడు. 2022 సబ్ జూనియర్ అండర్-15 విభాగంలో హైదరాబాద్, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ 2023లో సత్తా చాటాడు. జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు.



బహుమతులతో సిద్ధార్థ

ఆదర్శంగా తీసుకోవాలి



ఉమ్మడి జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో సిద్ధార్థకు గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. తమ పాఠశాలకు మొట్టమొదటి సారిగా జాతీయ స్థాయిలో పేరు తీసుకురావడం హర్షణీయం. చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చాటడం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి.

– భారతీ దేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, మిరుదొడ్డి

ఉమ్మడి జిల్లాకే తలమానికం



సబ్ జూనియర్, అండర్-14, 15 విభాగాల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరుస్తున్న సిద్ధార్థ ఉమ్మడి జిల్లాకే తలమానికంగా నిలుస్తున్నాడు. ఆటలో పట్టు సాధిస్తున్నాడు. చిన్న వయస్సులోనే పల్లె నుంచి జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడం గొప్పవిషయం.

– భైరయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్

మరింత రాణిస్తాను



చదువుతోపాటు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహానికి తోడు ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, జనరల్ సెక్రెటరీ పీవీ రమణ వద్ద తీసుకున్న ట్రైనింగ్ జాతీయ స్థాయిలో రాణించడానికి ఎంతో ఉపకరించింది. మరిన్ని పోటీల్లో పాల్గొని మంచి పేరు తీసుకొస్తాను.

– సిద్ధార్థ

హత్య చేసి.. చెరువులో పడేసి

- మద్యం మత్తులో దారుణం
- రూ.30వేల కోసం గొంతు నులిమి చంపిన నిందితులు
- జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లిలో ఘటన

జగదేవ్‌పూర్(గజ్వేల్): కలిసి మద్యం సేవించారు.. అతడి వద్ద ఉన్న డబ్బులను కాజేయాలని పన్నాగం వేశారు.. చివరికి గొంతు నులిమి చంపి చెరువులో పడేశారు.. అనంతరం కటకటాల పాలయ్యారు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర కరుణాకర్(28) గ్రామంలోనే కూలీ పనులతోపాటు కట్టె వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 18న పని నిమిత్తం వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు కింద నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

సెల్‌ఫోన్ అమ్మడానికి వచ్చి..

జగదేవ్‌పూర్‌కు చెందిన స్వామి అనే యువకుడు శనివారం స్థానికంగా ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద ఒకరికి సెల్‌ఫోన్ అమ్ముతుండగా షాపు వారికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు వచ్చి స్వామిని అదుపులోకి తీసుకొని విచారించగా కరుణాకర్ హత్య విషయం వెలుగులోకి వచ్చింది. అతడితోపాటు గణేశ్, నాగరాజులను అదుపులోకి తీసుకొని విచారించగా డబ్బుల కోసం హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు.

రూ.30 వేల కోసం..

నిందితులను అరెస్ట్ చేసిన అనంతరం పోలీసులు ఘటన వివరాలు వెల్లడించారు. కరుణాకర్ సొంత గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో కలిసి గురువారం మద్యం సేవించాడు. మద్యం ఎక్కువై కరుణాకర్ షాపు ఎదుట ఉన్న చెరువు కట్టపై నిద్రపోయాడు. రాత్రి 8 గంటల ప్రాంతంలో జగదేవ్‌పూర్‌కు చెందిన రాగుల గణేశ్, కొంపల్లి నాగరాజు కట్టపైకి వచ్చారు. నిద్రలో ఉన్న కరుణాకర్‌ను లేపి మా టామాటా కలిపి ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. తన వద్ద రూ.30 వేలు ఉన్నాయని కరుణాకర్ చెప్పడంతో ముగ్గురి మధ్య డబ్బుల విషయంలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఇద్దరూ కరుణాకర్ గొంతు నులిమి హత్యచేసి మృతదేహాన్ని రెడ్డమైన చెరువులో పడేసి అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లారు. మృతుడి సెల్‌ఫోన్‌ను జగదేవ్‌పూర్‌కు చెందిన స్వామి అనే వ్యక్తికి ఇచ్చి అమ్ముకరావాలని చెప్పడంతో అతడు వైన్ షాపు వద్ద అమ్ముతుండగా పక్కా సమాచారంతో పట్టుకున్నామని పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం చెరువులోని నుంచి మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. మృతుడికి భార్య లావణ్య, 4 ఏళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



కరుణాకర్ (ఫైల్)

న్యాయం చేయాలని రోడ్డుపై ధర్నా..

కరుణాకర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆదివారం జగదేవ్‌పూర్, భువనగిరి ప్రధాన రోడ్డుపై ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏసీపీ రమేశ్, గజ్వేల్ రూరల్ సీఐ జానకీ రాంరెడ్డి, ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబీకులకు న్యాయం చేస్తామని, నిందితులను చట్ట ప్రకారం శిక్షిస్తామని ఏసీపీ రమేశ్ హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.